క్లుప్తంగా

సదుం విద్యార్థుల ప్రతిభ



విద్యార్థులను అభినందిస్తున్న టీచర్లు

సదుం: స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు ఇద్దరు అండర్–17 రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలకు ఎంపికయ్యారని హెచ్‌ఎం జయకుమార్‌రెడ్డి మంగళవారం తెలిపారు. చౌడేపల్లెలో 19న నిర్వహించిన పోటీల్లో సోఫియా అంజుమ్, సుజిత్‌కుమార్ ప్రతిభ చూపడంతో రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారని చెప్పారు. విద్యార్థులను ఉపాధ్యాయులు, సిబ్బంది అభినందించారు.

ఖోఖో పోటీలకు వి.కోట విద్యార్థులు



ఎంపికైన విద్యార్థులు

వి.కోట: రాష్ట్రస్థాయి ఖోఖో పోటీలకు మండలంలోని పాముగానిపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు ఎంపికైనట్లు ఆ పాఠశాల హెచ్‌ఎం రవీంద్రనాథ్‌రెడ్డి మంగళవారం తెలిపారు. ఆయన మాట్లాడుతూ సోమవారం చిత్తూరు మెసానికల్ గ్రౌండ్‌లో జరిగిన అండర్–17 ఖోఖో పోటీల్లో పాముగానిపల్లి పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న కావ్య, 10వ తరగతి చదువుతున్న వికాస్ జిల్లా స్థాయిలో ఉత్తమ ప్రతిభ కనబరిచినట్లు తెలిపారు. వీరు నవంబర్ 1 నుంచి అనకాపల్లిలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటున్నట్లు పేర్కొన్నారు. విద్యార్థులను, పీడీ సురేష్‌ను పాఠశాల యాజమాన్యం అభినందించింది.

పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలి



అవగాహన కల్పిస్తున్న ఏఓ

పెద్దపంజాణి: వ్యక్తిగత శుభ్రతతో పాటు పరిసరాలను గ్రామస్తులు పరిశుభ్రంగా ఉంచుకోవాలని మండల పరిషత్ ఏఓ భాస్కర్ తెలిపారు. బసవరాజుకండ్రిగ గ్రామంలో ఇద్దరికి డెంగీ జ్వరం నిర్ధారణ కావడంతో మంగళవారం వైద్య, సచివాలయ సిబ్బంది కలసి గ్రామంలో పర్యటించారు. ఇంటింటికీ వెళ్లి జ్వరాలపై ఆరా తీశారు. పారిశుధ్య పనులు చేయించి మలాథియాన్ పిచికారీ చేయడంతో పాటు మంచి నీటి ట్యాంకులను శుభ్రం చేయించారు. సర్పంచ్ రమేష్ బాబు, మలేరియా సబ్ యూనిట్ అధికారి గంగయ్య, పీఎస్ సుజాత, ఎంపీహెచ్‌ఓ శ్రీనివాసులు పాల్గొన్నారు.

సేంద్రియంతో సాగు ఖర్చుల నియంత్రణ



సేంద్రియ ఎరువుల తయారీని వివరిస్తున్న అధికారులు

శాంతిపురం: సేంద్రియ పద్ధతులతో రైతులు పంట సాగు ఖర్చులను తగ్గించుకోవాలని జిల్లా వ్యవసాయాధికారి మురళీకృష్ణ చెప్పారు. పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా మంగళవారం ఆయన 121 పెద్దూరు వద్ద రైతుల అవగాహన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఆధునిక విధానాలను, సంప్రదాయ పద్ధతులను మేళవించడం ద్వారా రైతులు వ్యవసాయంలో మేలైన దిగుమతులు పొందవచ్చని చెప్పారు. సేంద్రియ ఎరువుల తయారీ పద్ధతులను రైతులకు ప్రయోగాత్మకంగా వివరించారు. ఏడీఏలు నాగపద్మిని, అన్నపూర్ణాదేవి, మండల వ్యవసాయాధికారి అప్సాజి, హార్టికల్చర్ అధికారి వింధ్య, మనోజ్, సురేష్, రాజేష్ పాల్గొన్నారు.

రాష్ట్ర అండర్‌-17 జట్లకు ఎంపిక



ఎంపికైన విద్యార్థులతో హెచ్‌ఎం, పీఈటీ

శాంతిపురం: మండలంలోని తిమ్మరాజుపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న ఇద్దరు విద్యార్థులు రాష్ట్ర స్థాయి అండర్–17 వాలీబాల్, ఖోఖో జట్లకు ఎంపికైనట్లు హెచ్‌ఎం వెంకటరమణ తెలిపారు. పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న వి.మేనక జిల్లా వాలీబాల్ జట్టులో, ఎస్.చిట్టి జిల్లా ఖోఖో జట్టులో స్థానం సాధించారని చెప్పారు. జిల్లా తరపున ప్రాతినిధ్యం వహించే జట్టు ఎంపిక కోసం పలమనేరు, చిత్తూరులో జరిగిన పోటీల్లో వీరు ఉత్తమ ప్రతిభ చూపారన్నారు. ఎంపికైన విద్యార్థులను, వారికి శిక్షణ ఇచ్చిన పీఈటీ చాముండేశ్వరీని ఈసందర్భంగా ఆయన అభినందించారు.

గెస్ట్ లెక్చరర్లకు దరఖాస్తులు

పలమనేరు: పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంగ్లిషు, జువాలజీ సబ్జెక్టులను బోధించేందుకు అర్హత కలిగిన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు ప్రిన్సిపల్ కన్నయ్య మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఇందుకు ఎంఏ ఇంగ్లిష్, ఎంఏ జువాలజీ పూర్తి చేసిన వారు గెస్ట్ లెక్చరర్ పోస్టులకు ఈనెల 26లోపు కళాశాలలో దరఖాస్తు చేసుకోవాలని ఈ సందర్భంగా ఆయన కోరారు.

రోడ్లు ఛిద్రం.. ప్రయాణం నరకం



పుంగనూరులోని ఎస్‌బీఐ వద్ద గుంతలు పడి నీరు నిలిచి ఉన్న దృశ్యం

వైఎస్సార్‌సీపీ అధికారంలో ఉన్నప్పుడు రోడ్లపై అక్కడక్కడ ఉన్న చిన్నపాటి గుంతలను కూడా భూతద్దంలో ఫోకస్ చేస్తూ టీడీపీ నాయకులతోపాటు ఎల్లో మీడియా సైతం పనికట్టుకుని దుష్ప్రచారం చేసేది. మట్టిరోడ్లను తారురోడ్లుగా మార్చిన వాటి గురించి ఎన్నడూ ప్రస్తావించిన పాపానపోనప్పటికీ, గుంతలకు మరమ్మతులు కూడా చేయడం లేదంటూ అభాండాలు మోపేవారు. పథకాలకే నిధులు కేటాయిస్తుండటం వలన ఈ దుస్థితి అంటూ టీడీపీ నాయకులకు ఎల్లో మీడియా బాకా ఊదేది. అధికారంలోకి రావడమే పరమావధిగా అప్పట్లో రోడ్లను కూడా టార్గెట్ చేశారు. ఇప్పుడు కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి నాలుగు నెలలైంది. ఎక్కడి రోడ్లు అక్కడే..ఎక్కడి గుంతలు అక్కడే అన్న చందాన ఉంటోంది. తమ పాలనలో దుస్థితికి చేరిన రోడ్లకు తట్ట కాదు కదా.. స్పూను మట్టి కూడా వేయడం లేదని ప్రజలు మండిపడుతున్నారు. ఇవిగో ఇక్కడ ఉన్న చిత్రాలు చూస్తే కూటమి పాలనలో రోడ్లు ఎంత అధ్వాన్నంగా ఉన్నాయో చెప్పకనే చెబుతాయి.

- 3 కిలోమీటర్లు.. 300 గుంతలు..!
- అధికారం కోసం నాడు రోడ్లనూ టార్గెట్ చేసిన టీడీపీ
- అధికారంలోకి వచ్చాక రోడ్ల స్థితిగతులు మరింత అధ్వానం
- మరమ్మతుల ఊసే లేదని మండిపడుతున్న జనం

పుంగనూరు: పుంగనూరు నుంచి బెంగళూరుకు వెళ్లే రోడ్డు బైరేబండ క్రాస్ వరకు మూడు కిలోమీటర్ల రోడ్డులో 300 పైచిలుకు గుంతలు ఉండడంతో ప్రయాణం నరకప్రాయంగా మారిందని ప్రజలు గగ్గోలు పెడుతున్నారు. పట్టణం నుంచి పుంగమ్మ చెరువు కట్టపై మార్గం పొడవునా గుంతలమయమైంది. అలాగే యాభైరాళ్ల మొరవ వద్ద మూడు అడుగుల లోతుతో గుంతలు తేలాయి. డాన్‌బోస్కో స్కూల్ వద్ద, అరవపల్లె వద్ద, ఇటుక బట్టీల వద్ద, ఆంజనేయస్వామి గుడి సమీపంలో, బైరేబండ సమీపంలో, కంపోస్ట్ యార్డు సమీపంలో లెక్కలేనన్ని గుంతలు పడ్డాయి! వర్షాలకు ఈ గుంతల్లో నీరు చేరి మరింత అధ్వాన్నంగా మారాయి. ఈ రహదారిలో కార్లు, ద్విచక్రవాహనాలు, బస్సులు ప్రయాణించడానికి ఫీట్లు చేయాల్సి వస్తోందని వాహనచోదకులు వాపోతున్నారు. అంతేకాకుండా మోటార్ సైక్లిస్టులు రోడ్ల మీద గుంతనో, నీటి నిల్వనో తెలియక అదుపుతప్పి పడి గాయాలపాలవుతున్నారు. అలాగే పట్టణంలోని ఎస్‌బీఐ వద్ద, హనుమంతరాయునిదిన్నె వద్ద, ఎన్‌ఎస్.పేట మసీదు వద్ద, కట్టపై ఉన్న దర్గా వద్ద, బైపాస్ రోడ్డు, బీడీ కాలనీల వద్ద గుంతలు ప్రజలకు నరకం చూపుతున్నాయి. పట్టణ సమీపంలోని రహదారులను సైతం మరమ్మతులు చేసేందుకు ప్రభుత్వం దృష్టి సారించకపోవడంతో బీజేపీ నేతలు ఇటీవల ఆందోళన సైతం చేశారు. అప్పటికి ప్రభుత్వం స్పందించకపోవడంతో ఎన్‌ఎస్ పేటకు చెందిన మునెప్ప రూ.10 వేలు ఖర్చు చేసి చెరువు కట్టపై గుంతలు పూడ్చారు. ప్రభుత్వం చేయవలసిన పనిని ఒక సామాన్యుడు తన శక్తి మేరకు చేసినా అటు ప్రభుత్వ యంత్రాంగం



50 రాళ్ల మొరవలో రహదారిపై గుంతలు



పుంగనూరు మండలం అరవపల్లె వద్ద గుంతలమయమైన రోడ్డు



బైరేబండ క్రాస్‌లో గుంతలు



హనుమంతరాయునిదిన్నె వద్ద రోడ్డుపై పడిన గుంతలు

రక్తదాన శిబిరం రేపు

పుంగనూరు: పట్టణంలోని మానవత, రోటరీ క్లబ్ సంస్థ ఆధ్వర్యంలో ఈనెల 24న రక్తదానశిబిరం నిర్వహిస్తున్నట్లు ప్రతినిధులు తెలిపారు. మంగళవారం వారు సంయుక్తంగా ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ ఆపదలో ఉన్నవారికి రక్తదానం చేసేందుకు శిబిరం ఏర్పాటు చేశామన్నారు. స్థానిక శుభారాం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఉదయం 10 గంటల నుంచి శిబిరం నిర్వహిస్తామన్నారు. రక్తదాతలు, విద్యార్థులు తప్పకుండా రక్తదానం చేయాలని కోరారు.

బాధ్యతల స్వీకరణ



ప్రదీప్

సదుం: మండల పశువైద్యాధికారిగా ప్రదీప్ మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన బదిలీపై అన్నమయ్య జిల్లా కేవీ పల్లె నుంచి ఇక్కడికి వచ్చారు. గతంలో ఉన్న పశువైద్యాధికారి సుబ్రమణ్యం పెనుమూరుకు బదిలీ అయ్యారు. పాడి రైతుల సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటానని ప్రదీప్ చెప్పారు.

ఉచిత వైద్యశిబిరానికి స్పందన



వైద్యపరీక్షలు నిర్వహిస్తున్న వైద్యురాలు

రామకుప్పం: మండలంలోని ఆరిమానుపెంట గ్రామంలో మంగళవారం కుప్పం కేసీ ఆస్పత్రి ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత మెగా వైద్యశిబిరానికి విశేష స్పందన లభించింది. శిబిరంలో 200 మందికి ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించినట్లు వైద్యులు తెలిపారు. అవసరమైన వారికి మందులు పంపిణీ చేసినట్లు తెలిపారు. వైద్యులు మంజునాథ్, గైనకాలజిస్ట్ శిల్ప, క్రితీష్ పాల్గొన్నారు.

నీటి ఎద్దడి లేకుండా చూడాలి

గుడుపల్లె: గ్రామాల్లో నీటి సమస్య తలెత్తకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని ఆర్‌డబ్ల్యూఎస్ సూపరింటెండెంట్ ఇంజినీర్ విజయకుమార్ అన్నారు. మంగళవారం స్థానిక శ్రీశక్తి భవనంలో కార్యదర్శులకు వెల్ఫేర్ అసిస్టెంట్‌లకు సమావేశం నిర్వహించారు. నీటి సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలన్నారు. ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ పురుషోత్తం, ఏఈ హేమలత పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎస్‌ఈ

ముదరంపల్లిలో గ్రామసభ



గ్రామసభ నిర్వహిస్తున్న రెవెన్యూ అధికారులు

పెద్దపంజాణి: మండలంలోని ముదరంపల్లిలో మంగళవారం రెవెన్యూ శాఖ ఆధ్వర్యంలో గ్రామసభ నిర్వహించారు. గత ప్రభుత్వంలో మండలంలోని 7 గ్రామాల్లో భూముల రీసర్వే నిర్వహించారు. అందులో ఏవైనా తప్పులుంటే సరిచేయడానికి నేటి నుంచి గ్రామసభలు నిర్వహిస్తున్నట్లు ఇన్‌చార్జ్ తహసీల్దార్ ప్రసన్నకుమార్ తెలిపారు. ముదరంపల్లె రెవెన్యూ గ్రామంలో నిర్వహించిన సమావేశంలో 51 మంది రైతులు తమ పట్టాభూముల హద్దుల్లో తేడాలు ఉన్నాయని వాటిని సరిచేయాలని అధికారులకు వినతులు ఇచ్చారు. గ్రామసభలు పూర్తయిన వెంటనే అభ్యంతరాలను పరిశీలించి పరిష్కరిస్తామని తహసీల్దార్ పేర్కొన్నారు. అదేవిధంగా 23వ తేదీ శివాడి, 24న శంకరాయలపేట, 25న నిడిగుంట, 26న అప్పినపల్లి, 29న చామనేరు, 30న పెద్దవెలగటూరులో గ్రామసభలు నిర్వహిస్తున్నట్లు ఆర్‌ఎస్ డీటీ రమేష్ తెలిపారు. మండల సర్వేయర్ సాయిరాజ్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

భూసమస్యలను పరిష్కరించుకోండి



గ్రామసభలో ప్రసంగిస్తున్న తహసీల్దార్

గుడుపల్లె: రెవెన్యూ అధికారులు గ్రామాలకు వచ్చినప్పుడు రైతులు భూ సమస్యలను పరిష్కరించుకోవాలని తహసీల్దార్ శీతారాం అన్నారు. మంగళవారం తిమ్మనాయనపల్లెలో నిర్వహించిన గ్రామసభలో ఆయన పాల్గొన్నారు. రెవెన్యూకు సంబంధించిన చేర్పులు, మార్పులు, భూసర్వేలు, సర్వే నంబర్ల తప్పిదాలుకు సంబంధించి సమస్యలకు అధికారుల వద్ద చేసుకోవాలన్నారు. గ్రామాలకు వచ్చినప్పుడు భూములు వద్దకు వెళ్లి పరిశీలించి పరిష్కరిస్తామన్నారు.

సామూహిక సీమంతం



గర్భిణులకు సీమంతం చేయిస్తున్న వైద్యాధికారులు

గంగవరం: మండలంలోని మన్నార్‌నాయనిపల్లిలో గర్భిణులకు గంగవరం పీహెచ్‌సీ వైద్యాధికారి శ్రీనివాసులు సొంత ఖర్చులతో మంగళవారం సామూహిక సీమంతం చేయించారు. ఇప్పటివరకూ పీహెచ్‌సీ సిబ్బందికి మాత్రమే ఇలాంటి కార్యక్రమాలు చేసేవారు. అయితే పేద మహిళలను దృష్టిలో పెట్టుకుని ఈ కార్యక్రమం చేయడం ఇదే మొదటిసారని ఆయన తెలిపారు. సీమంతపు సారె, అవసరమైన వస్తువులను గర్భిణులకు ఉచితంగా అందజేశారు. వైద్యాధికారి లహరి, పీహెచ్‌సీ సిబ్బంది పాల్గొన్నారు.

గార్గేయకు జలకళ



మొరవ పోతున్న కొర్లకుంటవారిపల్లె ప్రాజెక్ట్

సదుం: మండల సరిహద్దులోని సోమల మండల అటవీప్రాంతంలో కొద్దిరోజులుగా విస్తారంగా వర్షాలు కరుస్తున్నాయి. వాగులు, వంకలు పొంగి వరదనీరు కొర్లకుంటవారిపల్లె ప్రాజెక్టుకు చేరింది. ప్రాజెక్టు నిండడంతో మంగళవారం వేకువజాము నుంచి మొరవపోతోంది. ఈనేపథ్యంలో గార్గేయ నది ఉధృతంగా ప్రవహిస్తోంది. వరద నీరు పాపిరెడ్డిగారిపల్లె ప్రాజెక్టుకు చేరుతోంది. ప్రాజెక్టు నిండడంతో గ్రామస్తులు గంగమ్మకు పూజలు చేసి జలహారతి ఇచ్చారు. కాగా వరద నీటి కారణంగా పలువురు రైతులకు చెందిన బోరు మోటార్లు, స్టార్టర్లు కొట్టుకుపోయినట్లు సమాచారం. పలు చోట్ల గార్గేయనది ఉధృతంగా ప్రవహిస్తుండడంతో తహసీల్దార్ మారుఫ్ హుస్సేన్, ఎస్‌ఐ షేక్‌షావలి పరిశీలించారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. వరద నీటిలో వాగులు, వంకలు దాటే ప్రయత్నం చేయరాదని సూచించారు.

మెగా డీఎస్సీకి ఉచిత శిక్షణ

పలమనేరు: జిల్లాలోని ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు మెగా డీఎస్సీకి ప్రభుత్వం సాంఘిక సంక్షేమశాఖ ద్వారా ఉచితంగా కోచింగ్ ఇవ్వనున్నట్లు స్థానిక ఏఎస్‌డబ్ల్యూఓ హైమవతి మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. వీరికి మూడునెలలపాటు ఉచిత భోజనం, వసతిని కల్పించి శిక్షణనిస్తున్నట్టు అందులో తెలిపారు. వార్షిక ఆదాయం రూ.2.50లక్షల్లో ఉన్న ఎస్సీ, ఎస్టీలు జ్ఞానభూమి పోర్టల్ ద్వారా ఆన్‌లైన్‌లో ఈనెల 25 దాకా దరఖాస్తు చేసుకోవాలని అందులో సూచించారు.

వరికి తగిన మోతాదులో యూరియా



మాట్లాడుతున్న ఏడీఏ శివకుమార్

గంగవరం: మండలంలోని గుండుగల్లు గ్రామంలో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని ఎంపీపీ వెంకటరమణ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించారు. ఏడీఏ శివకుమార్ పాల్గొని రైతు సేవా కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో రైతులతో మాట్లాడారు. సేంద్రియ వ్యవసాయం ప్రాముఖ్యతను రైతులకు తెలియజేశారు. వరిలో యూరియా ఎక్కువ మోతాదులో వాడకం వలన చీడ పీడల సమస్య పెరుగుతుందన్నారు. ఉద్యానవనశాఖలో అమలవుతున్న పథకాలను ఉద్యానశాఖ అధికారి వరప్రసాద్‌రెడ్డి రైతులకు వివరించారు. సర్పంచ్ రమణ, ఏఓ హేమలత, రైతులు పాల్గొన్నారు.

ఆధునిక పద్ధతులతో పండించాలి

గుడుపల్లె: ఆధునిక పద్ధతులతో రైతులు పంటలను పండించాలని వ్యవసాయశాఖ అధికారి నాగరాజు అన్నారు. మంగళవారం సోడిగానిపల్లెలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. రైతులు తక్కువ ఖర్చుతో అధిక దిగుబడులు చేసేందుకు సేంద్రియ ఎరువులను ద్వారా పంటలను పండించాలన్నారు. రైతులు అంతర పంటలతో అధిక దిగుబడులు పొందాలని సూచించారు. సేంద్రియ ఎరువులతో చేసిన పంటలను పరిశీలించారు.

రాళ్లబూదుగూరులో ఓపెన్ స్కూల్

శాంతిపురం: రాళ్లబూదుగూరు జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఓపెన్ స్కూల్ సేవలు అందుబాటులోకి వచ్చినట్టు హెచ్‌ఎం రామచంద్రయ్య ఓ ప్రకటనలో తెలిపారు. 16 ఏళ్లు నిండిన వారు 10వ తరగతి పరీక్షలు రాయడానికి దరఖాస్తు చేసుకోవచ్చని పేర్కొన్నారు. ఇంటర్మీడియట్ కోర్సుల కోసం 19 సంవత్సరాల వయసు నిండిన వారు అర్హులని తెలిపారు. వివరాలకు 9000142435 నంబర్‌ను సంప్రదించాలని ఆయన కోరారు.

మెలకువలు గ్రహించండి

పుంగనూరు: రైతులు పంటలు పండించే సమయంలో మెలకువలు గ్రహించి పంటలు పండించాలని వ్యవసాయాధికారి ఫయాజ్ అన్నారు. మంగళవారం ఆయన మండలంలోని ఎర్రగుంట్లపల్లిలో రైతులతో కలసి పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా ఫయాజ్ మాట్లాడుతూ రైతులు కాలానుగుణంగా పంటలు పండించాలని, అందులో సాంకేతిక పద్ధతులను పాటించడం మంచిదన్నారు.

అనుమానితులపై నిఘా



సూచనలిస్తున్న సీఐ శ్రీనివాసులు

పుంగనూరు: గ్రామీణ ప్రాంతాల్లో కొత్తగా వచ్చి సంచరించే అనుమానితులపై నిఘా పెట్టాలని సీఐ శ్రీనివాసులు సూచించారు. మంగళవారం పట్టణం, మండలాలకు చెందిన సచివాలయాల పోలీసులకు అవగాహన సదస్సు నిర్వహించారు. సీఐ మాట్లాడుతూ సమాజంలో నేరాల నియంత్రణలో ప్రజల సహకారం పోలీసులు తీసుకోవాలన్నారు. ప్రజలతో మమేకమైతే ఎలాంటి నేరాలైనా అరికట్టేందుకు, సమాచారాన్ని సేకరించేందుకు ఎంతో ఉపయోగపడుతుందన్నారు. ఎలాంటి అసాంఘిక కార్యక్రమాలు జరిగిన వెంటనే సమాచారం అందించాలన్నారు.

హోమియో మందుల పంపిణీ



హోమియో మందులు పంపిణీ చేస్తున్న నాగేనాయక్

పుంగనూరు: పట్టణంలోని కొత్తయిండ్లు హైస్కూల్‌లో విద్యార్థులకు హోమియో మందులను పంపిణీ చేశారు. మంగళవారం స్థానిక ప్రభుత్వాస్పత్రికి చెందిన హోమియో వైద్యాధికారి నాగేనాయక్, హెచ్‌ఎం సుబ్రమణ్యం కలసి 1,235 మంది విద్యార్థులకు హోమియో మందులు పంపిణీ చేశారు. జ్వరాలు ప్రబలుతున్న నేపథ్యంలో ముందు జాగ్రత్తగా మందులు పంపిణీ చేస్తున్నట్లు నాగేనాయక్ తెలిపారు. సుబ్రమణ్యంరాజు, అక్బర్‌ఆలి, భాస్కర్‌రాజు పాల్గొన్నారు.

ఆలయాల్లో హుండీ లెక్కింపు



సత్యగంగమ్మ ఆలయంలో హుండీ లెక్కిస్తున్న సిబ్బంది

పలమనేరు: పట్టణంలోని పాతపేట టీకే వీధిలో వెలసిన సత్యగంగమ్మ ఆలయ హుండీ లెక్కింపు స్థానిక ఆలయంలో మంగళవారం జరిగింది. లెక్కింపులో రూ.1.21లక్షల నగదు, 5 గ్రాముల బంగారం, స్థానిక శివాలయంలో రూ.2.20లక్షల నగదు భక్తులు కానుకలుగా వేసినట్లు ఆలయాల ఈఓ కమలాకర్ తెలిపారు. లెక్కింపులో అర్చకులు, పట్టణ పెద్దలు పాల్గొన్నారు.